క్లుప్తంగా

563 మందికి వైద్యసేవలు

సీతానగరం: మండలంలోని చినకొండేపూడిలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 563 మందికి సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు వైద్యసేవలు అందించారు. మంచంపై ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యం చేశారు. ఎంపీయూపీ స్కూల్, అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరత్నం, సూపర్‌వైజర్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ అరుణ, ఏఎన్ఎం విశాలి, ఆశావర్కర్లు రాణి, సంధ్య, కుమారి పాల్గొన్నారు.

రేపటి నుంచి షష్ఠి ఉత్సవాలు


సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

మధురపూడి: కోరుకొండలోని సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి మహోత్సవాలు సోమవారం నుంచి ఈనెల 23వ వరకూ ఆరు రోజులు ఘనంగా జరగనున్నాయి. ఆలయ అభివృద్ధి కమిటీ ఉల్లి బుజ్జిబాబు, సెక్రటరీ ఒంటిపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో మోపర్తి వెంకటకృష్ణ దంపతులతో నిర్వహించనున్నారు. ఈ ఆరు రోజులు ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దారు.

ఆటో యూనియన్ ఆర్థిక సాయం


ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న ఆటో యూనియన్ ప్రతినిధులు

రాజానగరం: దివాన్ చెరువుకు చెందిన ఆటో వర్కర్ అక్కిరెడ్డి రామకృష్ణ గుండెపోటుతో మరణించారు. ఈ నేపథ్యంలో ఆయన కుటుంబానికి ఆటో యూనియన్ ఆర్థిక సాయం అందించింది. యూనియన్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు సీహెచ్ రాంబాబు, కార్యదర్శి వంక మల్లిబాబు తదితరులు శనివారం రామకృష్ణ ఇంటికి వెళ్లి రూ. 50 వేలు అందించారు.

వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శిగా పప్పు సింహాచలం


పప్పు సింహాచలం

పెదపూడి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శిగా పెదపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మండల బీసీ సెల్ కన్వీనర్, పద్మశాలీల సంఘం కాకినాడ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పప్పు సింహాచలం నియమితులయ్యారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ మేరకు రాష్ట్ర కమిటీ నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. 2024లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేయడానికి సైనికుడిలా పని చేస్తానన్నారు. ఆయనకు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ఓటు వజ్రాయుధం


ఓటు హక్కు క్లెయిమ్‌లపై సమీక్షిస్తున్న ఈఆర్‌వో శ్రీనివాస్

పెదపూడి: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధం లాంటిదని, దాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని అనపర్తి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏబీవీఎస్‌బీ శ్రీనివాస్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటు హక్కు మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన దరఖాస్తులపై శనివారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల ప్రకారం దరఖాస్తులను పరిశీలించాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ టి.సుభాష్, ఆర్‌ఐ ఎం.త్రివేణి, వీఆర్వోలు గణపతి, చండి, ఏఎస్‌వో మాధురి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్నాం

పెదపూడి: గ్రామీణ ప్రాంత ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నామని చైతన్య గోదావరి బ్యాంక్ రీజనల్ మేనేజర్ పి.శ్రీనివాస్ అన్నారు. పెదపూడిలో చైతన్య గోదావరి బ్యాంక్ బ్రాంచ్ ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఏడాదిలో బ్యాంక్‌లో సుమారు రూ.15 కోట్ల టర్నోవర్ జరగడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో స్థానిక బ్యాంక్ మేనేజర్ వేణుప్రసాద్, సొసైటీ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ర్యాలీ

మధురపూడి: కోరుకొండలో శనివారం అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ నల్ల బ్యాడ్జీలతో ప్రదర్శన నిర్వహించారు.

గ్రామ స్వరాజ్యం వైఎస్సార్ సీపీతోనే సాధ్యం

గ్రామాల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలు


వడిశలేరులో సంక్షేమ పథకాల లబ్ధి బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

రంగంపేట: గ్రామ స్వరాజ్యం వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని మండలంలోని వడిశలేరులోని సచివాలయం వద్ద సర్పంచ్ కొల్లాటి శ్యామలావతి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనటువంటి సంక్షేమ పథకాలను రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత అందించిన సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా జరిగిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాల బోర్డును ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ జెండాను పార్టీ కన్వీనర్ నలమాటి భీముడు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీకో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం కార్యదర్శి పాలాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

అనపర్తి: అర్హత ఉన్న ప్రతీఒక్కరికీ సంక్షేమ పథకాలు వారి ఇంటి ముంగిటకే చేర్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని పీరారామచంద్రపురంలో శనివారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అర్హులైన నిరుపేదలు పొందాలంటే జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా పార్టీ జెండా, అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొండా ప్రేమలత, పీరారామచంద్రపురం, అనపర్తి ఉపసర్పంచ్‌లు కేఎస్ఎన్ రెడ్డి, చిర్ల వీర్రాఘవరెడ్డి, మాజీ సర్పంచ్ పి.గంగరాజు, కోనాల సాయిరామారెడ్డి, కర్రి శ్రీనివాసరెడ్డి, జగన్, మణికంఠ, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ అజెండా

బిక్కవోలు: ప్రభుత్వం సంక్షేమమే ఆజెండాగా చిత్తశుద్ధితో పనిచేస్తుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ అన్నారు. శనివారం మండలంలోని రంగాపురంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ పథకాల లబ్ధి బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అప్పాజీ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గండికోట వీరభద్రరావు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి బొడ్డు ముత్యాలరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, పంచాయతీ విస్తరణ అధికారి జి.భవాని పాల్గొన్నారు.


పీరారామచంద్రపురంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న సత్తి రామకృష్ణారెడ్డి


రంగాపురంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించిన నాయకులు

శనగ రైతులకు రాయితీపై విత్తనాలు

- 550 క్వింటాళ్ల పంపిణీకి సిద్ధం
- జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు


రంగంపేటలో విలేకర్లతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి మాధవరావు

రంగంపేట: మిచాంగ్ తుపాను ప్రభావంతో రంగంపేట మండలంలో దెబ్బతిన్న శనగ రైతులకు 80 శాతం రాయితీపై విత్తనాలు అందిస్తున్నట్టు జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలంలో తుఫాను కారణంగా దెబ్బతిన్న శనగ పొలాలను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక రైతుభరోసా కేంద్రం వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడుతూ డిసెంబరు నెల మొదటి వారంలో వచ్చిన తుపాను కారణంగా చాలా వరకూ పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. ప్రధానంగా రంగంపేట మండలంలో 1300 ఎకరాల విస్తీర్ణంలో రైతులు సాగుచేసిన శనగ పంట దెబ్బతిందన్నారు. అందుకే ప్రభుత్వం మళ్లీ రెండోసారి సాగు చేసుకునేందుకు వీలుగా రైతులకు 80 శాతం రాయితీపై విత్తనాలు అందిస్తామన్నారు. ప్రస్తుతం 550 క్వింటాళ్ల శనగ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఆదివారం నుంచి రైతులకు అందిస్తామని చెప్పారు. రైతులందరూ విత్తనాలు తీసుకుని సకాలంలో విత్తనాలు నాటి మంచి దిగుబడులు పొందాలని సూచించారు.

వైద్యుడు రాజారెడ్డికి పరామర్శ

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామానికి చెందిన ప్రజావైద్యశాల వైద్యుడు ఎం.రాజారెడ్డిని శనివారం పలువురు పరామర్శించారు. ఆయన సతీమణి వరలక్ష్మి ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో రాజారెడ్డికి బీసీ సామాజిక వర్గం నేత బర్ల బాబూరావు పరామర్శించారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

పేదల పక్షాన నిలిచే ప్రభుత్వమిది

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


బలభద్రపురంలో పేదలకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


పీహెచ్‌సీ డాక్టర్ వేణుశ్రీలక్ష్మికి సూచనలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల పక్షాన నిలిచి అడుగడుగునా వారికి ఎదుగుదలకు కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని బలభద్రపురంలో జిల్లా పరిషత్ భూమిలో నివాసముంటున్న పేదలకు పట్టాలను శనివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని జిల్లా పరిషత్ చెందిన భూమిలో గత 30 ఏళ్లుగా నివాసముంటున్న 49 మంది పేదలకు భూపట్టాలు లేకపోవడంతో ఇబ్బందిపడుతున్నారన్నారు. అయితే ప్రతి పేదవాడికి ఇల్లు ఉండాలన్న లక్ష్యంగా జిల్లా పరిషత్‌కు చెందిన భూమిలో ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్నవారికి అధికారికంగా పట్టాలను అందజేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. గతంలో ఏ నాయకుడు ఇలాంటి పని చేయలేదన్నారు. వైఎస్సార్ సీపీ వచ్చిన తరువాత పేదలకు న్యాయం జరుగుతుందని లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బుంగా రామారావు, ఉపసర్పంచ్ నల్లమిల్లి వెంకటరెడ్డి, ఎంపీటీసీ ఆనందరెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, తహసీల్దార్ పోసిబాబు, వీఆర్వో మాచవరపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

రంగంపేట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, సిబ్బంది ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సూచించారు. మండల కేంద్రమైన రంగంపేటలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల వైద్యులు, సిబ్బంది గౌరవప్రదంగా నడుచుకోవాలన్నారు. వెల్‌నెస్ సెంటర్‌లో పనిచేసే సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సిబ్బంది అందరూ ఎక్కడెక్కడి నుంచో విధులకు హాజరవుతున్నారని, ప్రతీఒక్కరూ స్థానికంగా నివాసం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు వెల్‌నెస్ సెంటర్లను తనిఖీ చేసి సిబ్బంది సకాలంలో విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ వేణుశ్రీలక్ష్మిని ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఆసుపత్రి అభివృద్ధి కోసం నిధుల వినియోగానికి సంబంధించిన పలు తీర్మానాలకు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొల్లాటి ఇజ్రాయిల్, రాష్ట్ర చేనేత, రైతు విభాగం కార్యదర్శులు పాలాటి నాగేశ్వరరావు, రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, అనపర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాచిన గోవిందరాజు, పీహెచ్‌సీ డాక్టర్ కె.చిన్నారావు, సీహెచ్ఓ జయమణి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం


శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

సీతానగరం: చినకొండేపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో కో–ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ ఆడిటర్ ఎ.సుధాకర్ పర్యవేక్షణలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరం కో ఆపరేటివ్ బ్లడ్ డోనర్ వలంటరీ అసోషియేషన్ ద్వారా జరిగిన ఈ కార్యక్రమంలో 25 మంది రక్తదానం చేశారు. వారికి పీఏసీఎస్ చైర్‌పర్సన్ పోలినాటి రామచంద్రరావు, పర్సన్లు జంపన సూర్యనారాయణ రాజు, పుట్టాల వెంకటేశ్వర్లు, సీఈవో పేరిచర్ల సుబ్బరాజు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, బీసీసీబీ లీగల్ అడ్వైజర్ తోట రామారావు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో రఘుదేవపురం పీఏసీఎస్ సీఈవో ములగాడ రామకృష్ణ, పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు, సూపర్‌వైజర్ సుధాకర్ పాల్గొన్నారు.

వరాహ అవతారంలో భజేనారాయణస్వామి


భజేనారాయణస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

రంగంపేట: మండలంలోని వడిశలేరులో వేంచేసియున్న భజేనారాయణ స్వామివారి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని శనివారం స్వామివారిని వరాహ అవతారంలో అలంకరించారు. ఆలయ అర్చకుడు చిలకమర్రి మురళీకృష్ణమాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం శ్రీనరసింహ అవతారంలో స్వామివారు దర్శనమిస్తారని ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి ముమ్మన రాంబాబురెడ్డి తెలిపారు. పూజల్లో ఆలయ చైర్మన్ మావిరెడ్డి నెహ్రూ, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

మధురపూడి: క్రీస్తు బోధనలు అనుసరణీయమని బైబిల్ మిషన్ సెక్రటరీ డాక్టర్ ఎస్‌జే ఆనందపాల్ అన్నారు. సీతానగరం మండలం మిర్తిపాడు షాలోము స్వస్థత శాల ఆవరణలో శనివారం రాత్రి మెగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆనందపాల్ మాట్లాడుతూ క్రైస్తవులు నిరంతరం బైబిల్ పఠనం చేయాలన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శనలు, నాటికలు అలరించాయి. కార్యక్రమంలో యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ నక్కా ఆనందకుమార్, ముఖ్య సలహాదారులు వరిగేటి ప్రసన్నకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఇలియాజర్ పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుని కావడి ఉత్సవం


అశ్వరథ వాహనంపై కొలువుతీరిన శ్రీవల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారు


ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన అశ్వరథ వాహనం

అనపర్తి: స్థానిక వీర్రాజు మామిడి వద్ద గల శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో షష్ఠి ఉత్సవాల్లో భాగంగా శనివారం సుబ్రహ్మణ్య మాల దీక్షధారులు పాల కావడి ఉత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. అలయ అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సుబ్రహ్మణ్య మాలధారులు సుబ్రహ్మణ్య కావడి భుజాన ధరించి పేటతుళ్లి ఆడుతూ గ్రామ పుర వీధుల్లో ఊరేగుతూ ఉత్సవాన్ని, వల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి రథోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అడుగడుగునా మహిళలు కావడి ఉత్సవాన్ని నిర్వహిస్తున్న దీక్షాధారుల పాదాలపై పసుపు నీళ్లు పోస్తూ స్వాగతం పలికారు. ప్రత్యేకంగా అలంకరించిన అశ్వరథ వాహనంపై శ్రీవల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని కొలువు తీర్చి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాట నృత్యాలు, విచిత్ర వేషధారణలు, కేరళ డప్పువాయిద్యాలు నడుమ గ్రామంలో ఊరేగించారు.

వీరుళ్లమ్మ గరగ ముహూర్తం


గరగను ఆసాదుల శిరస్సున ఉంచుతున్న ఎమ్మెల్యే దంపతులు

అనపర్తి: స్థానిక గ్రామ దేవత శ్రీవీరుళ్లమ్మ అమ్మవారి జాతరను పురస్కరించుకుని అమ్మవారి మూలవిరాట్‌కు ప్రతిరూపంగా కొలిచే గరగను అమ్మవారి సన్నిధిలో నుంచి బయటకు తీసుకువచ్చే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ గరగ మంచి(ముహూర్తం) కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొని గరగకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం గరగను ఆసాదుల శిరస్సున ఉంచి గ్రామోత్సవానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో ఐదు రోజుల పాటు నిర్వహించే జాతర, తీర్థ మహోత్సవాల్లో భాగంగా నిర్వహించే గరగ గ్రామోత్సవంలో స్వయంగా అమ్మవారి ప్రతిరూపం గరగ రూపంలో తమ ముంగిటకు వచ్చినట్లు భక్తులు భావిస్తారన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు సత్తి వెంకటరామారెడ్డి, కమిటీ ప్రతినిధులు పడాల కళ్యాణ్‌రెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి, సత్తి సత్యనారాయణరెడ్డి, మేడపాటి వెంకటరామారెడ్డి, సత్తి బుల్లిరెడ్డి, చింతా సూరారెడ్డి, మేడపాటి రామకృష్ణారెడ్డి, తేతల వీరవెంకట సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యా వైజ్ఞానిక ప్రదర్శన


లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీలో ప్రదర్శన


బిక్కవోలులో వైజ్ఞానిక ప్రదర్శనను పరిశీలిస్తున్న అధికారులు

రాజానగరం: విద్యార్థుల్లో దాడి ఉన్న సృజనాత్మకతను గుర్తించి, అవసరమైన ప్రోత్సాహాన్ని అందించేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయని స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న అన్నారు. లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను శనివారం ఆయన సందర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలించి, వాటి వివరాలు తెలుసుకున్నారు. ఇక్కడ ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు జిల్లా స్థాయి ప్రదర్శనకు వెళతారని ఎంఈఓలు రామన్న దొర, జ్యోతిప్రసాద్ తెలిపారు. స్థానిక పెద్దలు, ఉపాధ్యాయులు కూడా పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

బిక్కవోలు: విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఎంఈవో సీహెచ్ సత్యనారాయణ అన్నారు. శనివారం బిక్కవోలు ఉన్నత పాఠశాలలో మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఎనిమిది ఉన్నత పాఠశాలల విద్యార్థులు తాము రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. న్యాయ నిర్ణేతలుగా ఎం.విజయకుమార్, సీహెచ్ ఆచార్యులు వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంఈవో–2 పూర్ణచంద్రరావు, పాఠశాల హెచ్ఎం పీవీ ప్రభాకరరావు, ఉపాధ్యాయులు జంగా సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు సాయం పంపిణీ


ప్రభుత్వ సాయాన్ని అందజేస్తున్న విజయలక్ష్మి

సీతానగరం: మిచాంగ్ తుపాను బాధితులను ప్రభుత్వ అన్ని రకాలుగా ఆదుకుంటోందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. మునికూడలి సచివాలయంలో శనివారం 36 ముంపు బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు, పాక్షికంగా ఇళ్లు దెబ్బతిన్న ఇద్దరికి రూ.10 వేలు చొప్పున ప్రభుత్వ సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ తీసుకున్న ముందస్తు నిర్ణయాలతో తుపాను నష్టం తగ్గిందన్నారు. మునికూడలికి చెందిన 36 కుటుంబాలకు 25 కిలోల బియ్యం, కందిపప్పు, ఆయిల్ ప్యాకెట్, ఉల్లిపాయలు, కూరగాయలు అందించారు. కార్యక్రమంలో పార్టీ కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, కవల కృష్ణమూర్తి, ఆకుల వీర వెంకట సత్యనారాయణ, తన్నీరు త్రిమూర్తులు, అంబటి రాజు, కొల్లి చిరంజీవి, గారపాటి నాగరాజు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు యూటీఎఫ్ మద్దతు

రాజానగరం: సమస్యల పరిష్కారం కోరుతూ రాజానగరంలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) మద్దతు పలికింది. యూటీఎఫ్ ప్రతినిధులు అరుణకుమారి, శ్రీనివాస్ తదితరులు శనివారం దీక్షా శిబిరాన్ని సందర్శించి, మద్దతు పలికారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన అవసరం


విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి

బిక్కవోలు: విద్యుత్ పొదుపుపై అందరికీ అవగాహన అవసరమని ఉభయగోదావరి విద్యుత్ శాఖ ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని పందలపాక శ్రీపదాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యుత్ పొదుపుపై అందరికీ తెలియజెప్పాలన్నారు. సహజ వనరుల పరిరక్షణకు, గ్లోబల్ వార్మింగ్ నియంత్రణకు విద్యుత్‌ను పొదుపు చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో డీఈ శ్రీధర్ వర్మ, డీఈఈ నిరంజన్‌బాబు, ఏఈ కె.బుజ్జిదొర, సిబ్బంది చిన్నబాబు, శ్రీనివాసరాజు, పాఠశాల హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన యాగ మహోత్సవాలు


యాగ మహోత్సవాలలో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్ దంపతులు, మార్గాని నాగేశ్వరరావు దంపతులు

రాజమహేంద్రవరం రూరల్: వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలో నాలుగు రోజులు నిర్వహించిన యాగ మహోత్సవాలు శనివారం దిగ్విజయంగా ముగిశాయి. ఎంపీ మార్గాని భరత్ రామ్, మోనా దంపతులు యాగకర్తలుగా లక్ష్మీగణపతి పూర్వక నవచండీ రుద్రసహిత నవగ్రహ సుబ్రహ్మణ్య మన్యుపాశుపత యాగ మహోత్సవాన్ని వేద పండితుడు కృష్ణశర్మ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. నగరవాసులతో పాటు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చి తిలకించారు. ముగింపు రోజైన శనివారం శక్తి పంచాయతన పూజలు, మహా సౌరసహిత అరుణ హోమం, కల్యాణాలను ఎంపీ దంపతులు నిర్వహించారు.

విశ్వనగరంగా రాజమహేంద్రవరం

ఎంపీ భరత్ రామ్ విలేకరులతో మాట్లాడుతూ లోక కల్యాణార్థం, రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలనే సంకల్పంతో నాలుగు రోజుల పాటు ఈ యాగ మహోత్సవాలను నిర్వహించామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మరింత సుపరిపాలన అందించేందుకు ఆ భగవంతుని పరిపూర్ణ ఆశీస్సులు అందజేయాలని సకల దేవతలను ప్రార్థించినట్టు తెలిపారు. తాను పుట్టి, పెరిగిన రాజమహేంద్రవరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దాలన్నదే నిరంతర తపన అన్నారు. రాజమహేంద్రవరం విమానాశ్రయంలో టెర్మినల్ బిల్డింగ్ విస్తరణకు మొన్ననే కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా శంకుస్థాపన చేశారని, అలాగే మోరంపూడి ఎఫ్‌ఓబీ, రైల్వే స్టేషన్‌లో 4, 5 ప్లాట్‌ఫాంల విస్తరణ పూర్తయ్యాయని, తూర్పు రైల్వే స్టేషను వైపు 6వ ప్లాట్‌ఫాం పనులు త్వరలో జరుగుతాయన్నారు. గోదావరిపై మరొక వంతెన కావాలని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వాన్ని కోరానని, వారు సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రకాశం నగర్: చెల్లుబోయిన మూర్తి క్రికెట్ టోర్నమెంట్ ట్రోఫీ సెర్మనీ ఫర్ దివాళీ ప్రీమియర్ లీగ్ పేరుతో ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు శనివారం ఆర్ట్స్ కళాశాల మైదానంలో బహుమతుల ప్రదానం చేశారు. చైతు ఫ్రెండ్స్ సర్కిల్, నాగార్జున క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో అవ్వారి ఉమా శంకర్, పట్నాల నాగార్జున ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, అనంతపురం జిల్లా డీఎస్పీ కొక్కిరి పృథ్వీతేజ, విశ్రాంత డీఎస్పీ నామగిరి బాబ్జీ, రాక్‌స్టార్ ఫుట్‌బాల్ క్లబ్ అధ్యక్షుడు సూర్యనారాయణమూర్తి హాజరయ్యారు.